క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో వినుకొండ విద్యార్థి ప్రతిభ



వినుకొండ: పట్టణంలోని క్రిస్టియన్ పాలెం చెందిన జి. పవన్ సాఫ్ట్ బాల్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ధనలక్ష్మి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలో ఎంపీఈడీ రెండవసంవత్సరంచదువుతున్న విద్యార్థి జి. పవన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో చౌడవరంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 18 నుంచి 20 వరకు సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్‌లో నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ, పీజీ కళాశాలలు పాల్గొన్నాయి. ఇందులో ధనలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీం ఈ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించారు. ఈ కాలేజ్ టీం నుంచి వినుకొండకు చెందిన విద్యార్థి జి. పవన్ కెప్టెన్‌గా వ్యవహరించి బంగారు పతకాన్ని సాధించాడు. ప్రతిభ చూపిన పవన్‌ను పలువురు అభినందించారు.

ఫామ్‌పాండ్‌లతో రైతులకు ఎంతో మేలు

నాదెండ్ల: నిల్వ చేసుకున్న వర్షపు నీటిని పంటల సాగుకు వినియోగించుంటే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో శనివారం అంతర్జాతీయ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని నాదెండ్ల గ్రామంలో రైతు బ్రహ్మంకు చెందిన వ్యవసాయ భూమిలో ఫామ్‌పాండ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 132 ఫామ్ పాండ్స్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. 2.5 – 3 సెంట్ల విస్తీర్ణంలో ఫామ్‌పాండ్ తవ్వుకుంటే జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.68 వేలు జాబ్‌కార్డు కలిగిన రైతులకు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామారావు, ఈసీ బుచ్చిబాబు ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయ కాంట్రాక్ట్ పోస్టులకు ఇంటర్వ్యూలు



నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ శనివారం నిర్వహించారు. ఈ ప్రక్రియకు పల్నాడు జిల్లా డీఆర్‌వో ఏకా మురళితో పాటూ ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవత్సవ, సత్తెనపల్లి, నల్గొండ ప్రిన్సిపల్స్ జగదీష్‌కుమార్ గుప్తా, డి శ్రీనివాసులు హాజరయ్యారు. ప్రైమరీలో నాలుగు పోస్టులు, ఉన్నత పాఠశాల పరిధిలో గణితం, సైన్స్, ఇంగ్లీష్, సంస్కృతం, స్పెషల్ ఎడ్యుకేటర్, కౌన్సెలర్‌తో పాటూ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, హిందీ, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులకు ఎంపిక ప్రక్రియ జరిగింది. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించారు. వీరు ఏప్రియల్ 1 నుంచి జరిగే విద్యా సంవత్సర ఆరంభ తరగతులకు హాజరుకానున్నారు. వారితో పాటూ గుంటూరు, సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయాల్లో ఎనిమిది మంది సబ్జెక్టు టీచర్లు పాల్గొన్నారు.

వృత్తులపై అవగాహన ఏర్పరచుకోవాలి



శావల్యాపురం: సమాజంలో ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ప్రజలకు సేవలు అందించే వృత్తులు సేవలను విద్యార్థులకు పరిచయం చేయటమే కమ్యూనిటీ హెల్పర్స్ ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశ్యమని శ్రీరామా పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చందు అన్నారు. శనివారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో కమ్యూనిటీ హెల్పర్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం విద్యార్థులు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు సమాజంలో వివిధ వృత్తులపై ఆధారపడి జీవించే వారిని ప్రత్యక్షంగా తెలుసుకోవటం ద్వారా భవిష్యత్‌లో వృత్తుల పట్ల అవగాహన కల్గియుంటారన్నారు. విద్య అంటే మూస పద్ధతిలో బట్టీ కొట్టే చదవటం కాదన్నారు. ఇలాంటి ప్రదర్శనలు వలన చిన్నారులకు పరిశీలన, గ్రహింపు వ్యక్తపరచటం వంటి అంశాలు తేలికగా అర్థమౌతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతమ్స్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్ లో గీతమ్స్ విద్యాసంస్థల వారి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌లు మాట్లాడుతూ ముందుగా చిన్నారులు క్రమశిక్షణతో ఉంటూ చక్కగా చదువుకోవాలని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు గుండాల స్వైనోమ్, కౌన్సిలర్ నక్క రమణారావు, పీవీ సురేష్ బాబు, డైరెక్టర్‌లు నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

శాంతి, సోదర, త్యాగాలకు రంజాన్ ప్రతీక

ఇఫ్తార్‌లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: శాంతి సామరస్యాలకు, సోదర భావానికి, త్యాగనిరతికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షల సందర్భంగా ఎనిమిదవ వార్డులో షేక్ కరిముల్లా ఫ్రెండ్స్ సర్కిల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొని రంజాన్ ఉపవాస దీక్షలు విరమించిన ముస్లిం సోదరులందరికీ భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు అంకుటిత దీక్షతో నెల రోజులు కఠినమైన ఉపవాస దీక్షను చేస్తారని అన్నారు. తమ కోరికలను నెరవేర్చాలని అల్లాను ప్రార్థిస్తూ ఐదు పూటలా నమాజ్ ప్రార్థనలు చేస్తారని పేర్కొన్నారు. ముస్లిం సోదరులందరూ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, సోదర భావంతో మెలగాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, పార్టీ పట్టణ నాయకులు షేక్ కరీముల్లా, షేక్ ఖాదర్‌బాష, సయ్యద్ ఖాదర్‌బాష, సయ్యద్ ఖాజా పాల్గొన్నారు.

ఆక్రమణలను వెంటనే తొలగించాలి

- బోర్డు ఏర్పాటుచేసిన వారిపై చర్యలు తీసుకోండి
- కోరిన ప్రజాసంఘాల నాయకులు



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: కత్తవ చెరువు కాలువ ఆక్రమణలు తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల తీరు మార్చుకొని వెంటనే ఆక్రమణలు తొలగించాలి ప్రజా సంఘాలు నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి. కోటనాయక్ మాట్లాడారు. స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని ఆవులు సత్రం పక్కన ఉన్న కత్తవ చెరువు కాలువ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేయడమే గాక ఈ నిర్మాణాల జోలికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం చూస్తుంటే చట్టం అనేది అసాంఘిక శక్తులకు చుట్టంగా మారిందా అనే అనుమానం వస్తుందని అన్నారు. ఈ చర్య మున్సిపల్ అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. ఇది ప్రభుత్వ స్థలమని అధికారులు నిర్ధారించి బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, భూకబ్జాదారులే ఇది మాస్థలం, ఎవరైనా వస్తే చర్యలు ఉంటాయని బోర్డులు ఏర్పాటు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలు తొలగించాలని కోరుతూ అర్జీ పెట్టిన ప్రజా సంఘాలకే సమస్య పరిష్కారం కాకుండా పరిష్కారమైందని సంతకాలు చేయాలని కోరటాన్ని ఖండిస్తున్నామన్నారు. తక్షణమే కత్వ చెరువు కాలువ సర్వే నిర్వహించి ఆక్రమణ తొలగించేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా స్వచ్ఛ నరసరావుపేట ఏర్పాటు లక్ష్యమని ప్రకటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కూడా ఈ ఆక్రమణలపై జోక్యం చేసుకొని ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబం మోసం చేసిందని అనలేదు

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట: వైఎస్ కుటుంబం తనను మోసం చేసిందని తాను అనలేదని, అనని విషయాన్ని అన్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పడం సరికాదని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ విమర్శించారు. పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్‌తో 1978 నుంచి తమ మామ, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్యతో ఉన్న సాన్నిహిత్యం, వైఎస్సార్ జీవించి ఉన్నంత కాలం కొనసాగిందన్నారు. ఆ అనుబంధంతోనే డాక్టర్ వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన పార్టీలోకి రావడం జరిగిందన్నారు.

కొండవీడులో సేద్యపు నీటి కుంట ప్రారంభం



ఫార్మ్‌పాండ్‌కు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో హేమలతాదేవి



శావల్యాపురంలో పంట కుంటల పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయినీ పార్వతి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న బాలవికాస్ ప్రతినిధులు

యడ్లపాడు: కొండవీడు గ్రామంలో ఎంపీడీవో హేమలత దేవి, గ్రామ పెద్దల సమక్షంలో కళ్యాణపు రాఘవయ్య పొలంలో సేద్యపు నీటి కుంట పనులకు శనివారం భూమిపూజ ప్రారంభించారు. వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఫార్మ్ పాండ్స్ ప్రారంభోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలత దేవి మాట్లాడుతూ నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నీటి కుంటల ఏర్పాటుతో భవిష్యత్ తరాలకు నీటి భద్రత అందుబాటులో ఉండటమే కాకుండా, రైతులకు సాగు నీటి లభ్యత మెరుగుపడుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుందరరావు, గ్రామపెద్దలు సిలార్, ఉపాధి సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

ఉపాధి పంట కుంటలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: అర్హత కల్గియున్న రైతులందరు పంట కుంటలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శనివారం మండల కేంద్రం శావల్యాపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో పంట కుంటల పనులను ప్రారంభించారు.ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని 15 గ్రామపంచాయతీలలో 118 పంట కుంటలు తీయటానికి అనుమతులు వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు, ఫీల్డ్ అసిసెంట్స్ చెరుకూరి బాలకృష్ణ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మతుకుమల్లి పాఠశాలలో..

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం కార్యక్రమం పురస్కరించుకొని విద్యార్థులచే ర్యాలీతో అవగాహన సదస్సు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివి.కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈసందర్భంగా బాలవికాస్ ప్రతినిధి గణేష్ పాల్గొని మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యలగాల బసవయ్య, బాలవికాస్ ప్రతినిధి రాజు, పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: వేసవిలో పంటలు కాపాడుకోవటానికి నీటికుంటలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో పావులూరి ఉమాదేవి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నీటి కుంటల పనులను నూజెండ్ల గ్రామంలో శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నీటి కుంటలు ఏర్పాటు ద్వారా రైతు అవసరాలతో పాటు భూగర్భ జలాలను పెంపుదలకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు ,గ్రామపెద్దలు లగడపాటి సూరిబాబు, జడ్డా రామయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

నరసరావుపేట రూరల్: నీటి వనరులు తగ్గుతున్న నేపథ్యంలో జలాన్ని పొదుపుగా వాడుకుందామని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి తెలిపారు. పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని స్కాట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్వతి మాట్లాడుతూ భవిష్యత్‌లో నీటి కొరత రాకుండా ఉండాలంటే పొదుపుగా వాడుకోవడం ఒక్కటే మార్గమని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

■ పుస్తక పఠనం అలవర్చుకోండి



నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. పట్టణంలోని ప్రకాష్ నగర్లో గల లూథరన్ అంధులపాఠశాలలో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె. మధుస్వామి పాల్గొని మాట్లాడారు. జీవిత నైపుణ్యాల గురించి వివరించారు. నీటి ప్రాధాన్యత గురించి తెలియజేశారు. నీటిని దుర్వినియోగం చేయకూడదని సక్రమంగా వినియోగించుకోవాలని తద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయవచ్చు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి అలవర్చుకోవాల్సిన నైపుణ్యాలను వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను వివరించారు. అదేవిధంగా పెద్ద చెరువులోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో అదనపు సీనియర్ సివిల్ జడ్జి నక్క లావణ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ఎక్కువ కాలం పుస్తకాలు అధ్యయనంతో గడపాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్యార్థులు అవలంబించవలసిన విధానాలను వివరించారు. ఎస్ఐ వంశీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

■ నేడు నిరసన ప్రదర్శన

వినుకొండ: పట్టణంలో 23వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు సర్దార్ షాహిద్ భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ లేబరేషన్ నాయకులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏనుగుపాలెం రోడ్డులోని సీపీఐ ఎంఎల్ లేబరేషన్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి నిరసన ర్యాలీ నిర్వహిస్తారు.కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి షేక్ ఫిరోజ్ , కామ వెంకటేశ్వర్లు, సంఘం దుర్గాప్రసాద్, ముగపాటి. ప్రసాద్ పాల్గొన్నారు.

■ పీ4తో బీపీఎల్ కుటుంబాలకు ప్రయోజనం

నాదెండ్ల: పీ4 సర్వేతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు (బీపీఎల్) ప్రయోజనం చేకూరుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీల వద్ద శనివారం గ్రామ సభలు నిర్వహించారు. గణపవరంలో జరిగిన గ్రామ సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్చి 1వ తేది నుండి 18 వరకూ జరిగిన పీ4 సర్వే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 99 శాతం పూర్తయిందన్నారు. సచివాలయంలోని సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయం, ఆస్తులు, వాహనాలు తదితర సమాచారాన్ని సేకరించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల కృష్ణమూల, సిబ్బంది పాల్గొన్నారు.

■ న్యాయవాది పంగులూరి మృతి

నరసరావుపేటటౌన్: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పంగులూరి ఆంజనేయులు చౌదరి (75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. పంగులూరి నర్సరావుపేట సబ్ కోర్టు, అదనపు జిల్లా న్యాయస్థానాల ఏపీపీగా సేవలందించారు. రెండు పర్యాయాలు నరసరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా వ్యవహరించారు. విషయం తెలుసుకున్న న్యాయ వాద సంఘ అధ్యక్షులు మేదరమెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు జి. అలెగ్జాండర్ సుధాకర్, పి.ఎల్.ఎన్ శాస్త్రి, జీవి సుబ్బారావు, మద్ది సుభాషిని, బి. పిచ్చేశ్వరరావు, ఎం ప్రతాప్ రెడ్డి, జి రవీంద్ర, కె. విజయ్ కుమార్ పంగులూరి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు.

■ విద్యార్థినులకు అవగాహన సదస్సు

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థినీలకు కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సైకాలజిస్ట్ అండ్ కౌన్సిలర్ రావలి శాంతి వర్ధన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి విద్యార్థులు ఒక లక్ష్యమును ఏర్పాటు చేసుకొని, ఆ దిశగా కెరీర్ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.ఎల్. బాలశౌరీలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

■ మంచినీటి చెరువులు నింపేందుకు కృషి

చిలకలూరిపేట: మంచినీటి చెరువులను సాగర్ జలాలతో పూర్తి స్థాయిలో నింపేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. సాగర్ జలాలను తోడి చెరువులకు పెట్టేందుకు ఏర్పాటు చేసిన పంపింగ్ మోటార్లను శనివారం ఆయన పరిశీలించారు. సాగర్ జలాలతో చెరువులను త్వరగా నింపేలా 100 హెచ్‌పీ మోటార్లను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈఈ సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

■ పిల్లల సంరక్షణ కోసం పోక్సో చట్టం

చిలకలూరిపేట: పిల్లల సంరక్షణ కోసం పోక్సో చట్టం రూపొందించబడిందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిలకలూరిపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నివారణకు ఈ చట్టం రూపొందించబడిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, ఎంపీడీవో కె శ్రీనివాసరావు, ఎస్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.

■ అన్నీ వార్డుల్లో పీ4 సర్వే రీసర్వే చేయండి

నరసరావుపేట: అన్నీ వార్డుల్లో పీ-4 సర్వే రీసర్వే చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఐదో వార్డు సచివాలయంలో పీ4 సర్వేపై మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా జనసేన జిల్లా అధికార ప్రతినిధి షేక్ ఆద్రూఫ్ మాట్లాడుతూ సర్వేపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సర్వే చేసేందుకు మున్సిపల్ అధికారులకు కేవలం ఆరు రోజుల సమయం మాత్రమే ఇవ్వటంతో సక్రమంగా జరగలేదని, కొన్ని ఇళ్లకు మాత్రమే వెళ్లి తూతూ మంత్రంగా నిర్వహించారని అన్నారు.

• ఈకేవైసీ నమోదు చేసుకోండి

నూజెండ్ల: వేలుముద్రల కారణంగా ఇప్పుటి వరకు రేషన్ సరుకులు అందని లబ్ధిదారులు సంబంధిత డీలరు వద్ద ఈకేవైసీ నమోదు చేయించాలని తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి

- ప్రభుత్వ పథకాలు వారికి కేటాయించాలి
- డీజే సిస్టంతో దెబ్బతింటున్న కళలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

బొల్లాపల్లి : కళాకారులను ఆదుకోవాలని గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ ఏవీ సుధాకర్‌కు మండల కళాకారుల తరుపున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడి కళా పీఠం ఆధ్వర్యంలో వారు మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను పునర్జీవం చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం సాంస్కృతిక విభాగానికి చెందిన నిధులను కళాకారుల ఆర్థికాభ్యున్నతికి కేటాయించి కళల ప్రదర్శనకు అవకాశాలు కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అనారోగ్యానికి గురవుతున్న కళాకారులను, వారి పిల్లలను ఆదుకోవాలన్నారు. డీజే సిస్టం వలన కళాకారుల వృత్తికి ఆటంకంగా ఉందని, జీవనోపాధికి ఇబ్బందికరంగా మారిందని తహసీల్దార్ సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో కళాకారులు తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు ముప్పాళ్ల వ్యాయామ విద్యార్థులు



ఎస్‌కె .హయిమ్



కె.ప్రేమ్‌కుమార్

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయమా కళాశాలకు చెందిన ఎస్‌కె.హయిమ్, బీపీఈడీ కె.ప్రేమ్‌కుమార్, ప్రథమ బీపీఈడీ విద్యార్థులు ఈనెల 20, 21 తేదీల్లో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల చోడవరంలో జరిగిన అంతర్ కళాశాలల బేస్ బాల్ పోటీల్లో పాల్గొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెలాఖారు పంజాబ్ యూనివర్సిటీ చండీఘర్‌లో జరిగే అంతర విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్‌బీ నాయక్, అరవింద్, దాసు, వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

ఆల్ ఇండియా పోటీల్లో ఎన్ఈసీ విద్యార్థి ప్రతిభ



సాయిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ ఎంవీ కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: ఆల్ ఇండియా బాల్ బాడ్మింటన్ పోటీలలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ కనభర్చినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఫిబ్రవరి నెలలో నిర్వహించిన జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ బాల్ బాడ్మింటన్ పోటీలలో కళాశాల విద్యార్థి ఎస్.సాయి పాల్గొని ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు బెంగుళూరు నార్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఆల్ ఇండియా అంతర యూనివర్సిటీ పోటీలలో జేఎన్‌టీయూకే ప్రతినిధ్యం వహించి ప్రతిభ కనబర్చినట్టు వివరించారు. ఆల్ ఇండియా పోటీలలో పాల్గొన్న సాయిని కళాశాల చైర్మన్ ఎంవీ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎం .చక్రవర్తి, కార్యదర్శి ఎం.రమేష్, ఎంసీఏ విభాగాధిపతి కె.లక్ష్మీనాథ్, ఏవో శ్రీధర్, వ్యాయామ అధ్యాపకులు ఎల్.కృష్ణారెడ్డి, ఎన్.ఆంజనేయులు, విజయ కుమార్ అభినందనలు తెలిపారు.

కే-రిడ్జి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో



నీటి వనరులను ప్రదర్శిస్తున్న చిన్నారులు



చిన్నారుల ప్రదర్శనలను తిలకిస్తున్న చైర్మన్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో అవగాహన శక్తి, మానసిక ఎదుగుదలకు సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని కే-రిడ్జి పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలలో శనివారం కిండర్ గార్డెన్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనలను నాతాని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. తద్వారా దేశం గర్వించదగిన శాస్త్రవేత్తలు తయారవుతారని తెలిపారు. ప్రదర్శన లో విద్యార్థులకు నిత్య జీవితంలో ఉపయోగపడే నమూనాలను ప్రదర్శించారు. నీటి వనరులు- సంరక్షణ, ట్రాఫిక్ సిగ్నల్స్, తదితర అంశాలపై అవగాహన కలిగేలా నమూనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్వర్టు విస్తరణ పనులు ప్రారంభం



గణపవరంలో మేజర్ డ్రెయిన్ శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మించిన ఆర్చ్ ఎదురుగా రాకపోకలకు అంతరాయంగా ఉండటంతో కల్వర్టు తొలగించి డ్రెయిన్‌పై శ్లాబు నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. కల్వర్టు వద్ద ప్రధాన కాలువను శనివారం పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. పారిశుద్ధ్య కార్మికులు కాలువలోని సిల్టును తొలగించారు. ఆర్చ్ నిర్మాణం పూర్తయ్యాక కల్వర్టు గోడ రాకపోకలకు సమస్యగా మారటంతో దీన్ని తొలగించి కాలువపై శ్లాబు నిర్మాణానికి పంచాయతీ అధికారులు అనుమతులు తీసుకున్నారు. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ అధికారులు కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సైడు కాల్వల్లో ఉన్న సిల్టును పూర్తిగా తొలగించి క్రింది భాగాన బెల్టు అమర్చారు. ఇది పూర్తయితే రాకపోకలకు అనువుగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

శ్రామిక వర్గానికి అండగా నిలిచేది బీమా పథకమే



బాండ్ అందజేస్తున్న భవాని శంకర్, భార్గవ రెడ్డి

రొంపిచర్ల: నిత్య శ్రమ జీవులైన కార్మిక, శ్రామిక వర్గానికి అండగా నిలిచేది భారతి సిమెంట్ లక్ష రూపాయల బీమా పథకమేనని భారతి సిమెంట్ టెక్నికల్ సీనియర్ ఆఫీసర్ ఎస్. భవాని శంకర్ అన్నారు. స్థానిక వైష్ణవి ఏజెన్సీలో భవన నిర్మాణ రంగ కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, వాల్ నిర్మాణం, కాంక్రీట్ పనులలో తీసుకోవాల్సిన మెటీరియల్ పరిమాణాన్ని వివరించారు.
మార్కెటింగ్ ఆఫీసర్ కె. జయరామిరెడ్డి మాట్లాడుతూ అత్యంత నాణ్యతా పరిమాణాలతో తయారు చేసిన భారతి సిమెంట్‌తో నిర్మించటం వల్ల ఎక్కువ కాలం మన్నిక ఉంటుందన్నారు. తమ సిమెంట్‌తో స్లాబ్‌లు వేస్తే వారం రోజుల వ్యవధిలో తమ సంస్థ అధికారుల వచ్చి నాణ్యతను పరిశీలిస్తారన్నారు. ఈ సందర్భంగా రూ. లక్ష ఉచిత బీమా సౌకర్యం కల్పించిన కార్మికులకు బాండ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి ఏజెన్సీ ప్రొప్రైటర్ భార్గవ రెడ్డి, పలువురు భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు, భవన నిర్మాణ యజమానులు పాల్గొన్నారు.